తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


# సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా : జిల్లా ఎస్పీ



సత్యవేడు, డిసెంబర్ 1 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా తమిళనాడుకు సమీపంలో ఉండటం వల్ల సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా గతంలో ఏర్పాటు చేసిన ఇసుక తనిఖీ కేంద్రాల వద్ద తిరిగి బందోబస్తు చర్యలు తీసుకుంటామన్నారు. కొన్నిచోట్ల తనిఖీ కేంద్రాలు వాడకంలో లేని విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి స్థానిక విలేకర్లు తీసుకుని వెళ్ళడం జరిగింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దు గ్రామాల్లో అక్రమ రవాణా లేకుండా అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా సత్యవేడు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో కొన్నిచోట్ల విలేకర్లను అకారణంగా, గతంలో వార్తలు ఇచ్చారనే నేపథ్యంలో విలేకర్లపై కొంతమంది దాడులకు పాల్పడుతు న్నారని, అటువంటి వాటికి అవకాశాలు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకునే విధంగా ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సిబ్బంది కొరత ఉన్న విషయం సత్యవేడులో వాస్తవమేనని, త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. ఈకార్యక్రమంలో పుత్తూరు డిస్పీ శ్రీనివాస రావు, సిఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, వరదయ్యపాళ్యం ఎస్ఐ నాగార్జున్‌లు పాల్గొన్నారు.

## శ్రీ మూస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి

# రూ7.65 కోట్లు



చంద్రగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శంకుస్థాపన గావించారు. అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆలయ అర్చకులు సూరి స్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొదటి సూపం నిర్మాణ పనులను చెవిరెడ్డి చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు శ్రీకృష్ణదేవరాలు పాలనలో మహిమాన్వితమైన అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అయితే నేడు ఆలయ పునర్నిర్మాణ పనులను ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి పాలనలో చేపట్టడం గర్వకారణమన్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను రూ.7.65 కోట్లతో అత్యంత సుందరంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేవిధంగా రూపుదిద్దుతున్నట్లు తెలిపారు. టిటిడి, దేవాదాయ శాఖ నుండి రూ.4.30 కోట్లు, తుడా నుండి రూ.1.20 కోట్లు కేటాయించేందుకు ఎంఎల్‌ఏ ఎనలేని కృషి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే భక్తులు సైతం తమవంతుగా విరాళాల రూపంలో రూ.1.30 కోట్లు అందజేశారని అన్నారు. దాతలకు అమ్మవారి ఆశీస్సులు పరిపూర్ణంగా లభించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధితో పాటు ఎంఎల్‌ఏ ప్రతి పంచాయతీకి రూ.2 కోట్ల మేర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బండారు హేమచంద్రారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నవరత్నాలు అమలు చేసినట్లు నిరూపిస్తే... రాజకీయాలకు దూరం

**-రుషికొండలో రాజకోట రహస్యం -మాజీ మంత్రి, టిడిపి నేత గంటా శ్రీనివాసరావు**



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గంటా

శ్రీకాళహస్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త : ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి పూర్తిస్థాయిలో దోచుకుంటున్నాడని, నవరత్నాలు పేరిట ప్రజలను మోసం చేస్తున్నారని నవరత్నాలు పూర్తిస్థాయిలో అమలు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలకు దూరంగా ఉంటానని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి శుక్రవారం విచ్చేసిన ఆయనకు ఆలయ పరిపాలన భవనం వద్ద టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అలాగే బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారు. తొలుత బ్రహ్మగుడి ఆవరణలోని పంచముఖేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న అనంతరం ఆయనకు ఆలయాధికారులు దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారను. అనంతరం ఆలయంలోని దక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆయనకు స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించి వేదపండితుల ఆశీర్వచనాలను అందించారు. ఇక్కడ నుంచి ఊరందూరులోని దివంగత నేత మాజీ మంత్రిబొజ్జల గోపాలకృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని పాత్రికేయులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారలోకి వచ్చి రాష్ట్రంలో రాక్షస పాలనను సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమం కంటే స్వప్రయోజనాలకే పెద్దపీఠ వేస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు న్నరేళ్ళుగా పట్టించుకోకుండా ఇప్పుడు ఉత్తరాంధ్ర విశాఖ అభివృద్ధి అంటూ కళ్లబొల్లి మాటలు చెబుతున్నారని తెలిపారు. అయితే న్యాయ స్థానాలుకు ఇచ్చిన నివేదికల్లో మాత్రం పర్యాటక ప్రాంత అభివృద్ధి అబద్దాలు చెప్పి ఇప్పుడు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయమని వెల్లడించడారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేసి రూ.450కోట్లు వ్యయంతో రాజకోట నిర్మాణం చేపట్టారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కోటంతా రహస్యంగా మారిందని అత్యంత ఖరీదైన సామగ్రితో నిర్మాణం చేస్తున్న ఈ కోటలో అమర్చిన కొన్ని వస్తువులు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్న విషయాన్ని ఆయన బహిర్గతం చేశారు. నవరత్నాల పేరుతో నవమోసాలకు పాల్పడిన జగన్ అండ్ కో ఇప్పుడు ఏముఖం పెట్టుకుని ఓట్ల కోసం ప్రజల వద్దకు వస్తారని నిలదీశారు. నవరత్నాల్లో ఒక్క రత్నం కూడా పూర్తిగా అమలు కాలేదన్నారు. అమలుచేశామని నిరూపిస్తే రాజకీయాలకు దూరంగా ఉంటానని శ్రీకాళహస్తి వేదికగా చేస్తున్న సవాల్‌ను స్వీకరించాలని వైసిపి నేతలకు పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తిరుమల పర్యటకు వచ్చినపుడు పోలీఉలు తనతో అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. అలాగే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌తో పాటు పలువురు టిడిపి సీనియర్‌నాయకులు పట్ల కూడా పోలీసులు ఇదేరకంగా వ్యవరించారని తెలిపారు. పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు సినీనటుడు అశోక్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుశస్థలీనదిలో ఉన్న రోడ్డును పట్టించుకోరా!

**-మంత్రిగారు మీరైనా... రోడ్డు నిర్మాణానికి దృష్టి పెట్టలేరా...?**

నగరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: నగరి కుశస్థలీనదిలో ఉన్న రోడ్డు వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వ అధికారులు, నాయకులు పట్టించుకోలేదని సీపీఐ నాయకులు ఆరోపించారు. శుక్రవారం నగరిలో వారు మాట్లాడుతూ నగరి కుశస్థలీనదిలో ఉన్న రోడ్డు పూర్తిగా వర్షాలకు దెబ్బతిని మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టలేదని, అనేక సార్లు అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చినా రోడ్డు మాత్రం నిర్మించలేదన్నారు. తిరుపతి-చెన్నై, కాంచీపురం, పాండిచ్చేరి ప్రాంతాలకు వెళ్లాలన్న ప్రధాన రోడ్డు మార్గం నగరిలో ఉంది. ఈ రోడ్డుపైన నిత్యం వందలాది బస్సులు వేలాది మంది ప్రయాణికులు నడుస్తూ ఉంటాయి. నగరి చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో రైతులు విద్యార్థులు, ప్రజలు అందరూ ఈ మార్గం ద్వారానే వస్తుంటారు. ఈ రోడ్డు తెగిపోయి మూడు సంవత్సరాలు పూర్తవుతున్న అనేక సార్లు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులకు మున్సిపల్ అధికార యంత్రాంగానికి తెలియపరచిన సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వర్షం పడిన ప్రతిసారి ఆ మట్టి బురదమయంగా మారి ప్రజలునడవలేక ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు తిరగాలన్నా రోడ్డు గుంతలమయంగా ఉంది. నగరి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పినటువంటి వైసీపీ నాయకులు మరి ఈ రోడ్డు నిర్మాణానికి మీరు ఎందుకు పూనుకోలేదని వారు డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి ఇప్పటికైనా స్పందించి ఈ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించి ప్రయాణికులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మించాలన్నారు. ఆటోలు నడపాలన్న, బైకులు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రం మేల్కొని రోడ్డు వేయాలని మంత్రి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్‌లో చుట్టు పక్కల ప్రజానీకాన్ని సమరించి పెద్ద పోరాటం చేస్తామని హెచ్చరించారు.సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్‌బాషా, సిరావుద్దీన్, ఏఐటీయూసీ నాయకులు మనీ, అయులు, బాబు, సుబ్రహ్మణ్యం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలుతున్న సిగరెట్లు పట్టివేత

**- కోటి 45 లక్షల విలువైన సిగరెట్లు సీజ్**



పట్టుబడిన సిగరెట్లతో ఎస్ఇబి అధికారులు, పోలీసులు

దొరవారిసత్రం, డిసెంబర్ 1 ప్రభాతవార్త : పాట్నా నుంచి మధురైకి అక్రమంగా తరలుతున్న సిగరెట్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేసి పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామ సమీపంలో పాట్నా నుంచి మధురైకి వెళుతున్న కంటైనర్ లారీని నిఘా ఉంచి పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. పట్టుబడిన కంటైనర్ లారీలో కోటి 45 లక్షల రూపాయల విలువైన వివిధ కంపెనీల సిగరెట్లు ఉన్నట్లు గుర్తించారు. అయితే సిగరెట్ల రవాణాకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి దొరవారిసత్రం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఇబి అధికారులు వెంకటరవి, చంద్రశేఖర్, నాగసురేష్, రమాదేవి, నాయుడుపేట రూరల్ సిఐ వైవీ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా...

# ఓటర్ల నమోదు ప్రక్రియ

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**

చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఓటర్ల నమోదు, మార్పులు, తీసివేతల ప్రక్రియ అత్యంత ప్రాధాన్యమైనదని, క్షేత్ర స్థాయి సిబ్బంది నుండి ఇఆర్‌ఓల వరకు ఈ ప్రక్రియను ఎలక్షన్ కమీషన్



ఓట్ల నమోదుపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

నిబంధనల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఇఆర్‌ఓలు, ఎఇఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈపి రేషియో, జెండర్ రేషియో వుండేట్లు చూసుకోవాలని, ఎలాంటి క్రమరాహిత్యాలు లేకుండా ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు. అలాగే జంక్ క్యారెక్టర్లు 10 ఓట్లకు పైగా వున్న వాటి మీద ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి డ్రైవ్‌లో వుంచాలన్నారు. ఎవరైనా ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే అందుకు తగిన ఆధారాలు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బిఎల్‌ఓలు పోలింగ్ స్టేషన్‌లో తప్పకుండా వుండాలన్నారు. అలాగే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో వారి వివరాలను, వారు దరఖాస్తు చేసుకొన్న విధానం, దరఖాస్తుకు సమర్పించాల్సిన ఇతర ఆధారాలు సక్రమంగా వుండేలా చూడాలన్నారు. షిఫ్టింగ్ విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని, ఎవరైనా ఒక ప్రాంతం నుండి మరొక ర్పఆంతానికి తమ ఓటును మార్చుకోదలచినట్లైతే ఎక్కడి నుండి మార్చుకోవాలని భావిస్తున్నారో అక్కడ వారి ఓటు లేకుండా వుండేట్లు చూడాలన్నారు. ఫాం-7 విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చిన తిరస్కరించవచ్చునని, ఫాం-6 విషయంలో తగిన ధృవీకరణలు సమర్పించాలన్నారు. ఇఆర్‌ఓలు ఎప్పటికప్పుడు బిఎల్‌ఓలు హాజరు అయ్యారా! లేదా! అనే విషయంను పరిశీలించాలన్నారు. అలాగే నేడు, రేపు జిల్లా వ్యాప్తంగా వున్న పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ రాజశేఖర్, ఇఆర్‌ఓలు శ్రీనివాసులు, మనోజ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివయ్య, చిన్నయ్య, సుజన, భవానీలతో పాటు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, ఇవిఎం గోడౌన్ నోడల్ అధికారి చంద్రశేఖర్‌నాయుడు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

**హెచ్ఐవి వైరస్ కల్గిన వ్యక్తులకు కలెక్టర్ ధైర్యం :**

హెచ్ఐవి కల్గిన వ్యక్తులు భయపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా వుండాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్‌లతో కలిసి హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలిసో తెలియకో హెచ్ఐవి వైరస్ వచ్చివుంటుందని, దాని గురించి బాధపడాల్సిన అవసరం లేదని ధైర్యంగా వుండాలన్నారు. హెచ్ఐవి వైరస్‌తో శరీరంలో నిరోధక శక్తి తగ్గుతుందని, ఇమ్యునిటీ పెంచడానికి డాక్టర్లు ప్రయత్నించాలని, డాక్టర్లు సూచించిన మందులను క్రమం తప్పకుండా తీసుకోవడంతో పాటు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. హెచ్ఐవి సోకిన వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారిలో ధైర్యం నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అదే ఆప్యాయత...

# పలకరింపు!

**-ప్రజలకు సేవచేసే శక్తినివ్వమని వేడుకున్నా -టిడిపి అధినేత చంద్రబాబు**







తిరుమల,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి: నాలుగు నెలల తరువాత తిరిగి ప్రజాక్షేత్రంలోకి వెళ్ళడానికి ముందు ఇష్టదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం ఆలయం వెలుపల టిడిపి అధినేత,మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అందరినీ ఆప్యాయంగా పలకరించారు. తనకోసం ఆలయం ముందు వేచిఉన్న అందరినీ పలకరిస్తూ కాన్వాయ్ వరకు ముందుకు సాగారు. పెద్దఎత్తున గుమికూడిన పార్టీ అభిమానులు, తిరుమల స్థానికులు, భక్తులు చంద్రబాబుకు అభివాదం చేయడంతో ఆయన తిరిగి చేయెత్తి పలకరించారు. వేంకటేశ్వరస్వామి పాదాల చెంత పుట్టి,అంచెలంచెలుగా ఎదిగి ప్రజాసేవకు అంకితమయ్యానని అన్నారు. ప్రజలకు సేవచేసే శక్తి,సామర్థ్యాలు ఇవ్వాలని స్వామివారిని వేడుకున్నానని, ధర్మాన్ని కాపాడాలని ప్రార్థించానన్నారు. శుక్రవారం ఉదయం సతీమణి నారాభువనేశ్వరి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీమంత్రులు గంటా శ్రీనివాసరావు, ఎన్,అమరనాథరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి ఇన్‌ఛార్జి సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, గాలి భానుప్రకాశ్, బొజ్జల సుధీర్ ెండ్డి, డాక్టర్ మురళీమోహన్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, తిరుమల ఎన్టీఆర్ రాజు కుటుంబం, వెంకటేశ్,జనసేన నాయకుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి,చిత్తూరుజిల్లాకు చెందిన రాష్ట్రపార్టీ నాయకులతో కలసి చంద్రబాబు వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని కానుకలు సమర్పించారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాక్ట్ 27ను రద్దు చేయాలంటూ...

# న్యాయవాదుల నిరసన

**- ఈ నెల 15వరకు విధులు బహిష్కరణ**





చిత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 27ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిత్తూరు బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌ఆనంద్ యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల హరించడానికి రాష్ట్రప్రభుత్వం భూహక్కుల చట్టాన్ని తీసుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. న్యాయవ్యవస్థకు ఎటువంటి సంబంధం లేకుండా ఓ విధానాన్ని రూపొందించి ప్రజలపై రుద్దాలని ప్రభుత్వం చూడడం చాలా దారుణమన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే రైతులకు, ప్రజలకు అనేక రకాలైన ఆస్తి తగాదాల విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకొని న్యాయవాదులందరూ ఈనెల 15వ తేది వరకు విధులను బహిష్కరించి ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్య పరుస్తూ ఈ ప్రజా వ్యతిరేక చట్టాన్ని రద్దు చేసేంతవరకు న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీ లీలా మనోహర్‌నాయుడు,న్యాయవాదులు షఫీఉల్లా, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, ఎం.ఆనంద్, విశ్వనాథ్‌రెడ్డి, మధు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో...

# యోగాధ్యయన కేంద్రం ఏర్పాటు చేయండి

**-ఆఫ్‌లైన్ లక్కీడిప్‌లో సేవా టిక్కెట్లు భక్తులకు ఎస్ఎంఎస్ రావడంలేదు -డయల్ యువర్ ఈఓకు భక్తులు**



తిరుమల,డిసెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మికనగరం తిరుపతిలో యోగాధ్యయన కేంద్రం ఏర్పాటుచేయాలని నాగేశ్వరరావు కోరారు. ఈ ప్రశ్నకు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి సమాధానమిస్తూ తగిన విధంగా స్పందించి ఏర్పాటుకు చూస్తామన్నారు. తిరుపతికి చెందిన కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తిరుమలలో ఆఫ్‌లైన్‌లో లక్కీడిప్ ఆర్జితసేవల టిక్కెట్లు పొందిన భక్తులకు ఎస్ఎంఎస్ రావడం లేదని, సేవా టిక్కెట్లు పొందిన భక్తుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరచాలని కోరారు. దీనిపై సమాధానంగా ఆఫ్‌లైన్‌లో లక్కీడిప్‌లో సేవాటిక్కెట్లు పొందిన భక్తులకు ఎస్ఎంఎస్,వాట్సాప్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. ప్రతిరోజూ నిర్ణీత సంఖ్యలో సేవాటిక్కెట్లు విడుదల చేయడం వీలుకాదన్నారు. శుక్రవారం ఉదయం అన్నమయ్య భవనంలో "డయల్ యువర్ ఈఓ"కార్యక్రమం జరిగింది. టిటిడి జెఈఓ సదాభార్గవి, సిఈ నాగేశ్వరరావు, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్, ఎస్టేట్ అధికారి మల్లికార్జున, డిప్యూటీ ఈఓలు శెల్వం, భాస్కర్, రాజేంద్ర, ఐటి జిఎం సందీప్‌రెడ్డి, పిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, ఏపిఆర్‌ఓ నీలిమ తో కలసి భక్తులు అడిగిన 28ప్రశ్నలకు ఈఓ ఏవి ధర్మారెడ్డి సమాధానలిచ్చారు. తిరుపతికి చెందిన ఈశ్వర్ మాట్లాడుతూ అలిపిరి వద్ద శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం చక్కగా నిర్వహిస్తున్నారని, ట్విట్టర్‌ద్వారా కూడా భక్తుల సమస్యలకు సమాధానాలి వ్వండని కోరారు. ఈఓ ధర్మారెడ్డి సమాధానంగా టిటిడి కాల్‌సెంటర్‌కు కాల్‌చేసి సమాచారం తెలుసుకోవచ్చని, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు. ట్విట్టర్‌ద్వారా సమాచారం అందించే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. చీపురుపల్లి నుండి సుధాకర్‌రావు మాట్లాడుతూ తిరుమలలో గిరిప్రదక్షిణ ఏర్పాటుచేయండని కోరారు. దీనిపై ఈఓ సమాధానంగా తిరుమలలో ఒకే కొండ విడిగా లేదని,దీంతో గిరిప్రదక్షిణ అవకాశం లేదన్నారు. ఇన్నర్‌రింగురోడ్డు, ఔటర్‌రింగురోడ్డులో ఆలయ ప్రదక్షిణ చేయవచ్చన్నారు. 23వతేదీ నుండి జనవరి 1వతేదీ వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు క్యూలైన్లలో చలికి ఇబ్బందులు పడుతూ, ఎక్కువ సమయం వేచివుండటాన్ని నివారించేందుకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేస్తున్నామన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎయిడ్స్‌వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**కుప్పం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ద్రవిడ వర్సిటీ ఇసి మెంబర్ డా॥ ఆర్వీఎం నిర్మల సూచించారు. శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ద్రవిడ వర్సిటీలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ప్రమాదకరమైందన్నారు. ప్రధానంగా యువత ఎయిడ్స్ నివారణకు ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు తగు జా గ్రత్తలతో జీవన ప్రమాణాలు పెంచు కోవచ్చన్నారు. రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి మందులేదని కేవలం నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్ బాధితుల పట్ల చిన్నచూపు చూడరాదన్నారు. కార్యక్రమంలో డా॥ ఎం.ప్రభాకర్, డీన్ ఆచార్య శ్రీనివాస కుమార్, పిఒలు శ్రీనివాసులు, డా॥ హరికృష్ణ, శోభాదేవి, కళావతి, శైలమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంఎఫ్‌సి ఒకేషనల్ కాలేజ్, కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో పిఇఎస్ వైద్యులు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు.

## మృతుడి కుటుంబానికి పదివేల ఆర్థికసాయం

**కుప్పంరూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



మండలంలోని చెక్కునత్తం పంచాయతీ బాబునగర్‌కు చెందిన దొరై అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరఫున అంత్యక్రియల కోసం పదివేల ఆర్థికసాయాన్ని ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, డా॥ వెంకటేష్, చెక్కునత్తం మణి, కనకరాజ్, రాజగోపాల్, దేవేంద్ర, కృష్ణమూర్తి, రాము, లోకేష్, గణేష్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్‌చే ఆర్థికసాయం

**కుప్పం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



మండలంలోని చందం గ్రామంలో వైకాపా నేతలు గోవిందప్ప, శాంతిపురం మండల ం కోటగడ్డలో మునిరాజులు మృతి చెందారు. దీంతో ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ భరత్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు గాను ప్రతి కుటుంబానికి పదివేల వంతున ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్లు హెచ్‌ఎం మురుగేష్, బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## వైకాపా మహిళా అధ్యక్ష పదవికి..పార్టీకి రాజీనామా

**వి.కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



వి.కోట మండల వైఎస్సార్సీ మహిళా అధ్యక్షురాలు సరస్వతి తన పదవితో పాటు పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈమేరకు తన రాజీనామా పత్రాన్ని మండల కన్వీనర్ బాలగురునాథ్‌కు అందజేశారు. పార్టీలో తనకు సరైన గుర్తింపు లేకపోవడంతో తాను పదవికి రాజీనామా చేస్తున్నానని తన రాజీనామాను ఆమోదించి తన పార్టీ సభ్యత్వాన్ని సైతం రద్దు చేయాలని ఆమె రాజీనామా పత్రంలో కోరారు.

## 9న జాతీయ లోక్‌అదాలత్

**చిత్తూరురూరల్, డిసెంబరు 1ప్రభాతవార్త:**

కక్షిదారులకు సత్వర న్యాయం చేయడానికి జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 9వ తేది జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ తెలిపారు. కోర్టుల్లో వున్న పెండింగ్ కేసులు, కోర్టుల్లో వేయని వివాదాల కేసులను రాజీ మార్గంలో లోక్ అదాలత్‌నందు పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు తదితర కేసులో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కాగా జిల్లాలో అధిక సంఖ్యలో కేసుల పరిష్కా రానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్, రెవిన్యూ, వివిధ శాఖల అధికారులు, కక్షిదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఉత్తమ సేవలకు ఉత్తమ పురస్కారం

**సదుం,డిసెంబరు1 ప్రభాతవార్త :**



స్థానిక వైద్యశాలలో పనిచేస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్ బాలాజీకి శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందించారు. చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు సదుం ప్రభుత్వ వైద్యశాలలో ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తుగా జిల్లా వైద్య ఆరోగ్య అదికారి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం, ప్రశంశాపత్రం అందుకున్నారు. ఆయనను సదుం ప్రభుత్వ వైద్యశాల చైర్మెన్ కృష్ణారెడ్డి, వైద్యాధికారి పుష్పకుమారి, సిబ్బంది ఈసందర్భంగా అభినందించారు.

## సావిత్రమ్మ కళాశాల విద్యార్థినుల భారీ ర్యాలీ

**చిత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**



ప్రపంచ ఎయిడ్స్‌డేను పురస్కరిం చుకొని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు డా.ఎస్.షమ్స్ అక్తర్ శుక్రవారం విద్యార్థినులతో కలసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులు మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వ్యాధికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడంతో 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని చైతన్యపరుస్తూ నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపాల్. డా.కె. మనోహర్, వైస్‌ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రకుమార్, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డా.పి.సురేఖ, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డా.కోమల తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ఘనంగా ఎయిడ్స్ ర్యాలీ

**తవణంపల్లె, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం తవణంపల్లెలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహనవేలుల ఆధ్వర్యంలో ఈర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యసిబ్బంది, స్థానిక టి.పుత్తూరు రోడ్డు నుండి పాత పోలీస్‌స్టేషన్ వరకు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు వీరు 'ఎయిడ్స్ అంటువ్యాధికాదు– అంటించుకునేవ్యాధి' 'నిశ్శబ్దాన్ని చేదిద్దాం – ఎయిడ్స్ వ్యాధి గురించి తెలుసుకుందాం' 'మాట ఇద్దాం– ఎయిడ్స్‌ను అరికడదాం' వంటి నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి గర్భిణి విధిగా హెచ్‌ఐవి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది వ్యాధి పట్ల ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో వుండి సహకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భారతమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

## సహకార బ్యాంక్ ఎటిఎం కేంద్రం ప్రారంభం

**శాంతిపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



శాంతిపురంలో జిల్లా సహకార బ్యాంక్ ఏర్పాటుచేసిన నూతన ఎటిఎం కేంద్రాన్ని చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, డిసిసిబి ఛైర్మన్ రెడ్డెమ్మ కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ భరత్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం నూతన ఎటిఎంను ప్రారంభించా మన్నారు. అంతకుముందు 35లక్షలతో నిర్మించిన సింగిల్‌విండో అంగళ్ల సముదాయంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ మునిరత్నం గౌడు, రాష్ట్ర డైరెక్టర్ పెద్దన్న, వరదరాజులు, డిసిసి బ్యాంక్ మేనేజర్ గణేష్‌కుమార్, సిఇఒ శివారెడ్డి పాల్గొన్నారు.

## మంత్రి ఆదేశం... స్నేహితుడి ఔదార్యం

**చౌడేపల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆయన మిత్రుడు పుంగనూరుకు చెందిన ఎంఎం సంస్థల అధినేత మహమ్మద్దాలీ ఔదార్యంతో ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం మసీదు నిర్మాణ పనులు వేగవంతమవుతున్నాయి. స్థానిక మేదరదొడ్డిలోని ముస్లింల ప్రార్థనా మందిరం మసీదు భవనాన్ని 70యేళ్ళక్రితం నిర్మించారు. గుర్తించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నూతన భవనాన్ని నిర్మించదలచి పుంగనూరులోని తన స్నేహితుడు మహమ్మద్దాలీని ఆదేశించాడు. ఆయన ఆదేశానుసారం దాదాపు రూ.70లక్షలతో మసీదు పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, ఉపసర్పంచు అల్తాఫ్‌భాషా తదితరులు మసీదు పనులు పర్యవేక్షిస్తున్నారు.

## వ్యాధిని ద్వేషిద్ధాం...వచ్చినవారిని కాదు

**చౌడేపల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**




ఎయిడ్స్‌వ్యాధిని ద్వేషిద్ధాం వచ్చినవారిని కాదని హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, ఆరోగ్యకేంద్రం సంయుక్తంగా పట్టణంలో ర్యాలీ, బస్టాండులో మానవహారం నిర్వహించారు. ఎయిడ్స్ బాధితులకు ధైర్యం చెప్పి వారికి బతుకు నివ్వాలన్నారు. ముఖ్యంగా యువతీ, యువకులు ఎయిడ్స్‌పట్ల అవగాహన కల్గివుండాలన్నారు. అనంతరం ఎయిడ్స్‌వ్యాధి వాప్తి, నివారణా చర్యలను విద్యార్థులకు వివరించారు. వైద్యాధికారి పవన్‌కుమార్, ఇన్‌ఛార్జీ ప్రిన్సిపాల్ యశోదమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ బాలాజీ, బాలికా శిశుసంక్షేమ సంస్థ రేణుకాభాయి, ఎఎన్‌ఎం లత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**రొంపిచెర్ల, డిసెంబరు1 ప్రభాతవార్త :**



మండల పరిదిలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్ల ప్రాధమిక ఆరోగ్య కేంద్రంవైద్యాధికారి వినయ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్ ఐవీపై అవగాహన కల్పించారు. కలుషి తమైన సూదులు, సిరంజుల ద్వారా ఈ వ్యాధి సోకే అవకాశంఉందన్నారు.అదేవిధంగాఅసురక్షి తమైన రక్తమార్పిడి ద్వారాను, అసురక్షితమైన శృంగారం వల్లను ఈవ్యాధి సంక్రమిస్తుందన్నారు. తల్లినుండి బిడ్డకు,కూడావచ్చేఅవకాశాలున్నాయనిచెప్పారు.ప్రతిగర్భిణిరెండు సార్లు హెచ్‌ఐవీ టెస్టు చేసుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న ఐసీటీసీ కేంద్రాలలో ఈ టెస్టులను ఉచితంగా చేస్తారని , అదేవిధంగా అనుమానాలను నివృత్తి చేసేందుకు కౌన్సిలింగ్ ఇస్తారని చెప్పారు.కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ,సూపర్‌వైజర్ పంకజం,ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెరబైలులో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**యర్రావారిపాలెం,డిసెంబరు1 ప్రభాతవార్త :**

మండల పరిధిలోని నెరబైలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నెరబైలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కళాశాల విద్యార్థులతో కలిసి పుర వీధులలో ర్యాలీ నిర్వహించారు. ప్లేకార్డులు ప్రదర్శిస్తు మానవహారంగా ఏర్పడ్డారు. ఎయిడ్స్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, అధ్యాపకులు కిరణ్‌కుమార్,పురుషోత్తం, ఉమామహేశ్వరి, సుబాషిణి, సాయిజయంత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కృష్ణచైతన్య, సుమంత్, ఎంపీహెచ్‌ఓ నరహరిప్రసాద్,ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మైనింగ్ వల్ల ఎంతో మందికి జీవనాధారం

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**

కోట మండలం కర్లపూడి గ్రామ పంచాయతీలో సిలికా మైనింగ్ వల్ల సన్న చిన్నకారు రైతులు పంటలను పుష్కలంగా పండించుకుంటున్నారని తెలిపారు. శుక్రవారం కర్లపూడి గ్రామ రైతులు మాట్లాడుతూ గ్రామంలో మైనింగ్‌పై అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మెజారిటీ ప్రజలు మైనింగ్ ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. మైనింగ్ వల్ల ఏర్పడిన గుంతల్లో నీళ్లను పైపులైన్ల ద్వారా పంటలకు మళ్లించుకొని ఎన్నో కుటుంబాలు జీవనం పొందుతున్నాయని గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమంది కూలీలు మైనింగ్ వల్ల జీవనం పొందుతున్నారని చెప్పారు. ఎక్కడో ఉండి రాజకీయాలు చేయడం తగదని రైతులు తెలిపారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**

సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. డిసెంబర్ 20వ తేదీ నుంచి నిరవధిక దీక్షకు దిగనున్నట్లు ఇప్పటికే డిఇఒకి వినతిపత్రం అందజేసినట్లు ఆ ఉద్యోగులు తెలిపారు. విద్యాశాఖ పరిధిలో ఉన్న ఎస్‌ఎస్‌ఏలో 18 విభాగాల్లో ఒప్పంద, పొరుగు సేవల విధానంలో జిల్లా వ్యాప్తంగా సుమారు రెండువేల మంది పనిచేస్తున్నారు. వీరికి మూడునెలలుగా జీతాల్లేవు. తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. మండల స్థాయిలో సిఆర్‌పి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, విద్యాపర్సన్స్, భవిత కేంద్ర ఆయాలు, ఫిజియోథెరపిస్టులు, ఆర్ట్‌క్రాఫ్ట్ పిఇటిలు పనిచేస్తున్నారు. వీరందరూ సమ్మెలోకి వెళ్లనున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోలకే పరిమితమైందని అన్నారు. క్రమబద్ధీకరిస్తామని, కనీస వేతనాలు ఇచ్చేందుకు మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఉద్యోగులు గుర్తు చేస్తున్నారు. డిసెంబర్ 20వ తేదీలోగా సమస్య పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు.

## నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరు

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



కోట మండలంలోని 76 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమకు తెలంగాణ కంటే అదనంగా జీతాలిస్తామన్న ప్రభుత్వం నేడు మొండిచేయి చూపిందని చెప్పారు. తమ వద్ద ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందని ఆరోపించారు. అనేక రకాల డిమాండ్లతో తాము నాలుగేళ్లుగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో దశలవారీగా ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు వారు పేర్కొన్నారు. పలు సచివాలయాల పరిధిలోని కార్యదర్శులకు సమ్మె నోటీసు కూడా అందజేశారు.

## హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలి

**సదుం,డిసెంబరు 1 ప్రభాతవార్త :**




నేటి కాలానికి తగ్గట్లు ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించుకోవాలని చెరకువారిపల్లె ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గిరీషా అన్నారు. శుక్రవారం సదుంలోను, చెరకు వారిపల్లెలోను ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రెండు గ్రామాలలో ప్లేకార్డులు ధరించి ర్యాలీలు నిర్వహించారు. సదుం సంతలో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు హెచ్‌ఐవీ పరీక్ష చేయించు కోవాలని కోరారు. హెచ్‌ఐవీ నివారణ అందరి బాధ్యతగా ఉందని దాని గురించి చర్చించుకోవడం అవసరమని చెప్పారు. సమాజాన్ని కాపాడు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి, కమ్యూనిటీహెల్త్ ఆఫీసర్లు రషీద్, దీప,ఆరోగ్య సిబ్బంది హేమలత,సర్తాజ్, నాగరత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎండియు ఆపరేటర్లు, విఆర్‌ఓలు సమన్వయంతో పనిచేయాలి

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**

మండలంలోని ఎండియు ఆపరేటర్లు, విఆర్‌ఓలు సమన్వయంతో పనిచేయాలని తహశీల్దార్ ఎ.పద్మావతి కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలలో పకడ్బందీగా రేషన్ సరఫరా కోసం ఎండియు వాహనాలు ద్వారా పంపిణీ ప్రదేశాల్లో విఆర్‌ఓలు, వాలంటీర్లు దగ్గరుండి పారదర్శకంగా జరగాలన్నారు. పంపిణీ వివరాలు ప్రజలకు ఒకరోజు ముందే తెలపాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని కోరారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటు నమోదుపై క్యాంపులు ఉన్నందున ఓటర్లకు అందుబాటులో ఉండాలని కోరారు.

## వైసిపి పాలనలో దళితులకు తీరని నష్టం

**గూడూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దళిత శంఖారావం కార్యక్రమాన్ని శుక్రవారం నెల్లూరులో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా గూడూరు నియోజకవర్గ పరిధిలోని టిడిపి దళిత విభాగం నాయకులు వాహనాల్లో గూడూరు పట్టణం నుండి నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. వైకాపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, అమానుష సంఘటనలు రాష్ట్ర ప్రజలకు తెలియజేసే విధంగా దళిత శంఖారావం కార్యక్రమం పార్టీ చేపట్టిందని తెలిపారు. దళితులకు సంబంధించి 27 సంక్షేమ పథకాలను వైకాపా ప్రభుత్వం ఎత్తేసి దళితులకు ఎంతో మోసం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

**గూడూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎయిడ్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య సూత్రాలు పాటించి మంచి సమాజాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసినటువంటి విద్యార్థులకు సర్టిఫికేట్స్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీర కుమార్, అధ్యాపకులు, అధ్యపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం

**వెంకటగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డి దేనని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 25వ వార్డు కాంపాలెంలో రాష్ట్రానికి జగనన్న అవసరం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా సిఎం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ నక్కి భానుప్రియ వైస్ చైర్ పర్సన్ ఉమామహేశ్వరి, వైసిపి పట్టణ కన్వీనర్ డిల్లీ బాబు, కౌన్సిలర్ శుభావల్లి, కళ్యాణి, గోపాలకృష్ణ, కన్వీనర్ ప్రసాద్ రెడ్డి, నాయకులు మురళీకృష్ణ, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకు జగన్ పాలన

**బాలయపల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారని వైసీపీ మండల కన్వీనర్ వోందోటి కార్తీక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వెంగమాంబపురంలో గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఎంపిడివో ప్రమీలరాణి, ఈవోపీఆర్‌డివో భాస్కర్ రెడ్డి,శ్రీనివాసులు, సొసైటి అధ్యక్షులు కాసారం రంజనాదం, రాంబాబు, సర్పంచ్, వెంకటసుబ్బయ్య, బాబీచౌదరి,సుబ్బారాయలనాయుడు, వెంకటరామానా యుడు ,తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు!

**-లారీ డ్రైవర్ హత్యకేసులో ముగ్గురికి 14 సంవత్సరాల జైలు శిక్ష**

**-ఒక్కొక్కరికి 12 వేలు జరిమానా**

**గూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :**

లారీ డ్రైవర్ హత్యకేసులో ముగ్గురికి 14 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 12 వేలు జరిమానా విధిస్తూ గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం శుక్రవారం జీవిత ఖైదు తీర్పు ఇచ్చారు. వివరాల మేరకు ప్రకాశం జిల్లా పెర్నామిట్టకు చెందిన శేషుకుమార్ లారీ డ్రైవర్‌గా, గుంటూరు అవినాష్ క్లీనర్‌గా ఉన్నారు. 2015 సంవత్సరంలో కేరళకు చేపల లోడుతో వెళ్లి లోడు తాలూకు డబ్బులతో తిరిగి వస్తుండగా క్లీనర్ అవినాష్ ముందుగానే తన స్నేహితులైన జేష్ఠ వెంకటేష్, పోనుగంటి సుబ్బారామిరెడ్డిలకు సమాచారం ఇచ్చి డ్రైవర్ శేషుకుమార్‌ని హతమార్చాలని ప్లాన్ వేసుకున్నారు. ఈక్రమంలో వెంకటేష్ సుబ్బారామిరెడ్డిలు కారులో కాళహస్తి దగ్గర వేచి ఉండి. అవినాష్‌తో కలిసి డ్రైవర్ శేషుకుమార్‌ని హతమార్చి నాయుడుపేట శ్రీకాళహస్తి రోడ్డులో శేషుకుమార్ మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు. విచారణ చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదు విధించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుహాసిని వాదించారు.

## తడకండ్రిగలో ప్రభుత్వ పథకాల ప్రచారం

**తడ, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**




తడ మండలం తడకండ్రిగలో శుక్రవారం ప్రభుత్వ పథకాలపై అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రచారం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌నే చూడాలని నాయకులు ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. తడకండ్రిగ-2 సెగ్మెంట్ పరిధిలో జరిగిన మండల వైసీపీ అధ్యక్షుడు కెలివి ఆర్ముగంతో పాటు మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, ఎంపిడిఓ కె.అమోస్‌బాబు, స్థానిక సర్పంచ్ తుమ్మా జయప్రద, మండల కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, పార్టీ నాయకులు శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా లోక్ అధాలత్‌ను విజయవంతం చేయండి

**వెంకటగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ఈ నెల తొమ్మిదో తేదీ జరగబోవు మెగా లోక్ ఆధాలత్‌ను విజయంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సులోచన రాణి తెలిపారు. ఈ నెల 9వ తేది జరగబోవులో కేసుల రాజు పై పోలీసులు స్పెషల్ ఇన్ఫోసిమెంట్ బ్యూరో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. వీలైనంత కేసులను రాజీ చేయాలని సూచించారు. ముందుగా కక్షిదారులతో మాట్లాడి కేసులను రాజు చేయాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ జడ్జి గున్నయ్య, సిఐ నాగమల్లేశ్వరరావు, ఎస్సైలు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసి వర్గీకరణలో సంచార జాతులకు రిజర్వేషన్ కల్పించాలి

**వెంకటగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ఈ నెలలో ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల నందు జస్టిస్ రోహిణి కమిషన్ నివేదిక ఆధారంగా ఓబిసి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, సంచార జాతుల వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించి, న్యాయం చేయాలని అఖిలభారత సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేసారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాసరి, దొమ్మరి, వడ్డెర, మేదర, కాటి కాపరి, గంగిరెద్దుల, పాములు, బుడబుక్కల, జంగం, మొండి బండ, బాల సంతు, జోగి, పరిగి మొగ్గల, పిచ్చి గుంటల, వీరముష్టి మందుల, యాత, పూసల, పెద్దమ్మ వారు, చిన్నమ్మ వారు, తోలుబొమ్మలాట వారు మొదలైన సంచారజాతులు నేటికి దుర్భర దుస్థితిలో ఉన్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీ విజయానికి సంచార జాతుల వారు కృషి చేస్తారని ఆయన తెలిపారు.

## ఏడాదికి 18లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పతి

**తిరుమల,డిసెంబర్ 1 ప్రభాతవార్తప్రతినిధి:**



జిఎన్‌సి ప్రాంతంలో 5కోట్ల రూపాయలు విలువైనపరికరాలతో ఏర్పాటైన గాలిమర ద్వారా ఏడాదికి 18లక్షల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ముంబైకి చెందిన విష్‌విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ 800కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసే గాలిమరను శుక్రవారం ఉదయం లాంఛనంగా టిటిడి ఈఓ ఏవిధర్మారెడ్డి, జెఈఓ సదాభార్గవి, సిఈ నాగేశ్వరరావుతోకలసి ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటు నమోదుపై స్పెషల్‌డ్రైవ్

**సత్యవేడు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటు నమోదు ప్రక్రియ పై ఈనెల 2,3 తేదిల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సత్యవేడు తహసిల్దార్ షేక్ జరీనా పేర్కొన్నారు. శుక్రువారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో శని, ఆదివారము రెండురోజులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత బిఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10గం॥ల నుండి సాయంత్రం 5గం॥ల వరకు అందుబాటులో ఉన్న బిఎల్వోలు ద్వారాాఅర్హత ఉన్న యువతీ యువకులు తమ ఓటును నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం 6, తొలగింపు కోసం ఫారం 7, చేర్పులు, సరిచేయుట, ఓటు బదిలీలకు సంబంధించి ఫారం 8ను పూరించి బిఎల్వోలకు అందించాలన్నారు. ఈఅవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## డిఎస్‌ఒగా సయ్యద్ బాధ్యతల స్వీకరణ

**తిరుపతి క్రీడా,డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి.ఎస్.డిఒగా సయ్యద్ సాహెబ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతక ముందు ఆయన చిత్తూరు జిల్లా డిఎస్‌ఒగా పది సంవత్సరాల పాటు పని చేశారు. యువజన సర్వీస్ మరియు క్రీడాల శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలతో సీఈఓ స్థానంలో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించారు.

## సాంకేతిక పరిజ్ఞానం పై పట్టు రావాలి

**తిరుపతి క్రీడా,డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



వేద విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పురోభివృద్ధికి వ్యక్తిత్వ వికాసం గురించి విద్యార్థులు అవగాహన కల్పించారు. శుక్రవారం ఈ కార్యక్రమం ప్రారంభంమైంది. ఆచార్య రాణీ సదాశివమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సమావేశంలో కులపతులు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత క్రమ శిక్షణతో పాటు సమాజ బాధ్యతలను తెలుసుకొవాల్సిన ఏంతైనా ఉదంన్నారు. వేద ప్రచారాన్ని ఎలా చేయాలి, అనే అంశాలను వివరించారు. గొప్ప వైజ్ఞానిక అంశాలను మానవాళికి అందిచడంలో సాంకేతి పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించు కోవాలని వివరించారు. వ్యక్తి వికాసం గురించి విశ్వవిద్యాలయ వేద బాష ఆచార్య ప్రవా రామకృష్ణా సోమయాజి చక్కగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాడమిక్ డిన్ సుబ్రమణ్యం శర్మ, నీలకంఠం, ద.మధుబాబు, తదితరుల పాల్గొన్నారు.

## పాటలద్వారా ఘంటసాల చిరస్మరణీయులు

**తిరుపతి(క్రీడా),డిసెంబర్1 ప్రభాతవార్త :**



మధురమైన పాటలు ఆలపించి నేటికీ ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయులుగా గాయకుడు ఘంటసాల నిలిచి పోయారని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి కొనియాడారు. ప్రతినెలా ఒకటిన ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం చేయడం ఆనవాయితీ. శుక్రవారం ఉదయం రాయలసీమరంగస్థలి కళాకారులు గుండాల గోపీనాధరెడ్డి, కెఎన్ రాజా, తిరుమలయ్య, తొండమనాడు సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొని పుష్పాంజలి ఘటించారు. ఘంటసాల అభిమాని కస్పా పద్మనాభంను సత్కరించారు

## జామియా మక్కా మసీదుకు నూతన కమిటీ ఎంపిక

**నగరి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** నగరి పట్టణంలో జామియా, మక్కా మసీదులకు నూతన కమిటీ ఎంపిక శుక్రవారం జరిగింది. మసీదుల నిర్వహణ నిమిత్తం కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్న ముస్లిం సోదరులు శుక్రవారం జామియా మసీదులోను, మక్కా మసీదులోను సమావేశమయ్యారు. రెండు మసీదులకు కలిపి ఒకే కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. జమాత్ సభ్యులు ప్రకటించిన మేరకు జామియా, మక్కా మసీదు కమిటీ అధ్యక్షులుగా ఏ.ఎం.హబీబుల్లా, కార్యదర్శిగా వి.ఏ.తమీన్, ఉపాధ్యక్షులుగా హాజీ ఎస్.ఇ.అబ్దుల్ రహమాన్, ఉప కార్యదర్శిగా ఎం.అన్వరుద్దీన్, కోశాధికారిగా జి.యూనస్, కార్య నిర్వాహక సభ్యులుగా కె.ఇ.ఖాజా మొహిద్దిన్, ఎం.ఎం.నజీర్ అహ్మద్, పి.ఎం.రఫీ, ఏ.ఖాసిం, ఎం.షాహుల్ హమీద్, ఎం.అమాన్‌లు ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు ఇచ్చిన పదవులను బాధ్యతగా స్వీకరిస్తామన్నారు. మసీదు నిర్వహణ, అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ముస్లిం సోదరులకు అన్ని విధాలుగాను సహకారం అందిస్తూ అందుబాటులో ఉంటామన్నారు.

## ఎయిడ్స్ అంటించుకొనే వ్యాధి

**బంగారుపాళ్యం, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని, ఇది అంటించుకొనే వ్యాధి అని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ అన్నారు. శుక్రవారం జాతీయ ఎయిడ్స్ దినోత్సవంను పురస్కరించుకొని మండల కేంద్రం బంగారుపాళ్యంలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎయిడ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోహిత్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రపంచ దేశాలు ఎంతో కృషి చేశాయన్నారు. ఈ వ్యాధి కేవలం లైంగిక పరంగా వ్యాపిస్తుదని, ఇది అంటించుకొనే వ్యాధి అన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ శిరీష, డాక్టర్ అఖిల్, డాక్టర్ షాలిని, డాక్టర్ విజకుమారి, ఐసిటిసి కో-ఆర్డినేటర్ బాబు, ఎంపిహెచ్ఓ రమేష్‌బాబు, సిహెచ్ఓ షమీమ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ ఈ వ్యాధికి చికిత్స లేదని కేవలం నివారణ ఒక్కటే మార్గం అన్నారు. సైన్స్ టీచర్లు షంషీర్‌ఖాన్, విజయకుమారిలు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి మనోధైర్యం కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గురించి బహిరంగంగా చర్చించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎయిడ్స్ నివారణ సింబల్ వద్ద ప్రతిజ్ఞ పూనారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణురెడ్డి, వెంకటరెడ్డి, కేశవులు, దేవకి, అన్నపూర్ణ, జయప్రకాష్, సుబ్బలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ కట్టడి : ఎమ్మెల్యే

**చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



ఎయిడ్స్ కట్టడి చేయడానికి అవగాహన అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం ఈ సంవత్సరం నినాదం 'సంఘాలను నడిపించనివ్వండి' అనే నినాదంతో శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నుండి చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులులు, మేయర్ ఆముద, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవిలు జెండా వూపి ప్రారంభించారు. ఈ ర్యాలీ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి చర్చివీధి మీదుగా గాంధీ విగ్రహం వరకు సాగింది. ర్యాలీ అనంతరం జడ్పీ సమావేశభవనంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారిపట్ల న్యాయపరమైన చట్టంలోని అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధికారులు, ఎన్జీఓలు, ప్రజలు పాల్గొన్నారు.

## క్రైమ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**చిత్తూరు, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**

చిత్తూరు క్రైమ్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ తనిఖీ కోసం వెళ్ళిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్టేషన్ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్టేషన్ నిర్వహణ తీరు, సిబ్బంది పనితీరు, విధులు, ముఖ్య కేసుల దర్యాప్తు, స్టేషన్ కేసు డైరీ, క్రైం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డిపిఎల్, పిడిఎస్ రైస్ తదితర అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో జరిగిన హత్యకేసుల కారణాలపై అధ్యయనం చేసి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, క్రైమ్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణపై విస్తృతంగా అవగాహన

**గుడిపాల, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎయిడ్స్‌ని కట్టడి చేయడానికి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిహెచ్‌సి డాక్టర్ సంధ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం గుడిపాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి ఎయిడ్స్ నివారణకు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది ర్యాలీ

**విజయపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎయిడ్స్‌ను తరిమికొట్టవచ్చన్నారు. అవగాహన లేని కారణంగా, విచ్చలవిడి శృంగారం వల్ల ఎయిడ్స్ వస్తుందని తెలిపారు.వైద్యాధికారి డాక్టర్ విష్ణుప్రియ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి శాసనకర్తలు

**రేణిగుంట, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



నేటి విద్యార్థులే భవిష్యత్‌లో శాసన కర్తలని అమరరాజా విద్యాలయం ప్రిన్సిపల్ గ్లోరీదేవ ప్రియ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమరరాజా విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు రాజకీయ అవగాహన కోసం పార్లమెంట్ సమావేశాలు ఎలా నిర్వహిస్తారో ప్రత్యక్షంగా వివరించారు. విద్యార్థులతోపార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేసి సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాలు తమ విధులను ఎలా నిర్వహిస్తారు తెలియజేశారు. ముఖ్యంగా శాసనాలు చేసే శాసన కర్త విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్‌జయంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

**రేణిగుంట, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం గుత్తివారిపల్లె పంచాయతీ గుత్తివారిపల్లె ఎస్సీ కాలనీలోని ప్రజలకు ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ మర్దాల రవిబాబు ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఈసీ మెంబర్ డా. కోదండరామిరెడ్డి, సంస్థ వలంటీరు మస్తాన్, డా. పార్థసారథి, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్నదానం

**చంద్రగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు బి.కొంగరవారిపల్లికి చెందిన చలిచీమల రేవతి రాజశేర్ నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు దాతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఈఓ సి.ఆర్. తిమ్మారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు

**చంద్రగిరి, డిశంబర్ 1 ప్రభాతవార్త:**



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామలక్ష్మణ హనుమంతులు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాది నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత స్వాముల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు శ్రీ సీతా లక్ష్మణ సమేత హనుమంతులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్ర సాంకేతిక రంగాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల మేధాసంపత్తి

**పుత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**



పుత్తూరు-1 శ్రీ చైతన్య విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల సృజనాత్మకతకు జీవం పోయాలని ఎంజీఎం సురేష్, జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్ బాలాజీ సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శరవణ మాట్లాడుతూ అంతరిక్షంలో ఇళ్ళ నిర్మాణం, అక్కడ జీవన విధానం, మానవులు జీవించడానికి కావలసిన ఏర్పాటు వసతులపై పాఠశాల విద్యార్థుల అద్భుత ఆలోచనలతో ప్రాజెక్టులు సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీన్ మోహన్, నాసా ఇన్‌చార్జి నాగమణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పుత్తూరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

**పుత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**



ఎయిడ్స్‌డే సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కృష్ణకాంత్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుత్తూరు సివిల్ కోర్టు జడ్జి సి.జానకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీటీసీ సిబ్బంది, స్టెప్స్ సిబ్బంది హెచ్‌ఐడీ(ఎయిడ్స్)పై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ కరపత్రాలు అందించారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు డా. కృష్ణకాంత్ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాప్తిస్తుందని వ్యాధి సోకినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి ఉన్న లీగల్ సపోర్టు సహకారం ఎలా పొందాలన్న విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ సిబ్బంది చెంచమ్మ, సోమశేఖర్, ఆస్పత్రి వైద్యాధికారులు, సిబ్బంది చెంచమ్మ, సోమశేఖర్ పాల్గొన్నారు.

## భక్తి ప్రవర్తనలో శ్రీశ్రీశ్రీ మూల స్థానమ్మకు ప్రత్యేక పూజలు

**పుత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**



పుత్తూరు మున్సిపల్ పరిధిలోని కోనప్పగుంట గ్రామంలో వెలసిన గ్రామదేవత మూలస్థానమ్మకు దశమ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని వినాయకస్వామికి అభిషేకాలు, అలంకరణ చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న నాగాలమ్మకు పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. ఆలయంలోని శ్రీశ్రీశ్రీ మూలస్థానమ్మ మూలవర్లకు అభిషేకాలు చేశారు. ఆలయంలో విఘ్నేశ్వర పూజ కలశ స్థాపన శ్రీ లక్ష్మిదేవి అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**పుత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**



రైతులు, మహిళలు, పేద ప్రజలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు ఎంపీడీవో ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం పుత్తూరు మండలం తడుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ వెంకటేష్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారి చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కోదండయ్య, హెచ్‌వో సౌజన్య, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఆయుష్ డాక్టర్ సునీత, పీహెచ్‌సీ ప్రవీణ్, తడుకు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పుత్తూరు భవిత కేంద్రాన్ని తనిఖీ

**పుత్తూరురూరల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలంలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల భవిత కేంద్రాన్ని స్టేట్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ కల్పన, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలను వారి తల్లిదండ్రులతో ముఖాముఖిగా ముచ్చటించి వారి కష్టాలను పిల్లలు అభివృద్ధిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు సామర్థ్యాలను తెలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, ఐఈఆర్‌టీ సూర్యకుమారి, ఆనంద్ పాల్గొన్నారు.

## పూరిగుడిసె దగ్ధం

**వడమాలపేట, డిసెంబరు 1 ప్రభాతవార్త:**

మండలంలోని కల్లూరు దళితవాడకు చెందిన భూదేవికి చెందిన పూరిగుడిసె శుక్రవారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయం లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెపై భాగంలో వైర్లు ఉండడంతో మంటలు చెలరేగింది. చుట్టు పక్కల ఉన్న స్థానికులు గుడిసెపై భాగం నుంచి మంటలు రావడాన్ని గమనించి ఆర్పి వేశారు. నిరుపేదలైన భూదేవి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

# తిరుపతి డివిజన్

## ఆర్చరీ విభాగంలో సత్తా చాటిన గీతిక

**తిరుపతి (క్రీడ), డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



తిరుపతిలోని ఎయిర్ బైపాస్ రోడ్ హథీరాంజీ కాలనీలో వున్న బివికే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న డి. గీతిక ఈ నెల 25 నుండి 27 వ తేది వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జోయంపేట, విజయనగరం నందు నిర్వహించిన ఆర్చరీ విభాగం అండర్ 17 బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటు చదువు, అటు ఆటలలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆ విద్యార్థినిని, ఇంతటి ప్రోత్సాహన్నందించిన వారి తల్లిదండ్రులను పాఠశాల సిఇఓ అలేఖ్య రెడ్డి అభినందించారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం విద్యార్థి నిని ప్రశంసించారు.

## సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షకై అవగాహన సదస్సు

**తిరుపతి (క్రీడా), డిసెంబర్ 1 ప్రభాతవార్త**

స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో ఈ నెల3వ తేది ఆదివారం ఉదయం 9.00 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్‌లో 2024 విద్యా సంవత్సరంలో జాతీయ స్థాయిలో జరగబోవు ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు, నమూనా పరీక్ష నిర్వహించబడునని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.మరిన్ని వివరాలకు 9399976 999, 868888802 నెంబరులకు సంప్రదించవచ్చునని తెలిపారు.

## ఎస్‌పిడబ్ల్యూ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

**తిరుపతి (మహిళావర్సిటీ), డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌పిడబ్ల్యూ డిగ్రీ, పిజి కళాశాల టిటిడి తిరుపతి విద్యార్థులు హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి, లక్షణాలు, కారణాలు, నివారణ గురించి చార్ట్‌లను ప్రదర్శించి, కళాశాల ప్రాంగణంలో అవగాహన కల్పించారు. నివారణ, సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సోషల్ వర్క్ విద్యార్థులు నినాదాల ద్వారా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మహదేవమ్మ, సోషల్ వర్క్ లెక్చరర్ డాక్టర్ జి. పద్మజ, డాక్టర్ కె. కోకిల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజల్‌సేవ

**నారాయణవనం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవతో, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## అపిజె అబ్దుల్ కలాం అవార్డుకు మనోహర్‌నాయుడు ఎంపిక

**నారాయణవనం, డిసెంబర 1 ప్రభాతవార్త :**



మండలంలోని అరణ్యంకండ్రిగ గ్రామానికి చెందిన ప్రభుత్వ హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తున్న ఎన్ మనోహర్ నాయుడు ఎంపికైనారు. ప్రస్తుతం ఆయన చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం ఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్ల ప్రభుత్వం గుర్తించి ఎపిజె అబ్దుల్‌కలాం అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈనెల 3న ఈ అవార్డును అందుకోనున్నట్టు చెప్పారు. ఆయనకి అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## దివ్యాంగు పిల్లల్లో మనోధైర్యం నింపే విధంగా ప్రవర్తించాలి

**నారాయణవనం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



దివ్యాంగ పిల్లల్లో మనోధైర్యాన్ని నింపే విధంగా ప్రతి ఒక్కరు ప్రవర్తించాలని సమగ్ర శిక్ష సహిత విద్య రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ కల్పన కోరారు. మండలకేంద్రంలోని నారాయణవనం భవిత కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేవారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రం ఎలా నడుస్తుందోనని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించారు. విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి, కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్త పరిచారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని తల్లితండ్రులను కోరారు. పిల్లల్లో మనోధైర్యాన్ని నింపే విధంగా టీచర్లు చదువు నేర్పడంతో పాటు నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణవనం ఎంఇఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, టీచర్లు పాల్గొన్నారు.

## 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్



**తిరుపతిరూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**

భారతదేశం 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా కీర్తి పతాకానికి చేరుకోనున్నదని ఈవో పిఆర్డీ గిరిధర్‌రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. శుక్రవారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతిరూరల్ కుంట్రపాకం గ్రామ పంచాయతీలో నిర్వహించారు. భారతదేశం ఐక్యతను బోపేతం చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దేశ ఆర్థిక స్వాలంబనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంట్రపాకం గ్రామ పంచాయతీ సర్పంచ్‌రాచపాళ్యంశుభపద్మనాభరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నంద్యాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాల తనిఖీపై ఇంజనీరింగ్ సిబ్బందికి శిక్షణ

**తిరుపతిరూరల్, డిసెంబర్1 ప్రభాతవార్త:**



ఆయా గ్రామ సచివాలయాల పరిధిలలోని దుకాణాలలో తూనికలు-కొలతలు ఎలా తనిఖీ చేయాలో తూనికల-కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ జి.వి.సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి అర్బన్ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇచ్చారు. దుకాణాలలో తుకాలు, కొలతలలో జరిగే మోసాలను ఎలా తెలుసుకోవాలి అనే సవివరంగా తెలియజేసారు. అధిక ధరలకు కాకుండా ఎం.ఆర్.పి ధరలకే నిత్యవసర వస్తువులు విక్రయించేవిధంగా చర్యలు ఏలా తీసుకోవాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తూనికలు-కొలతలు అసిస్టెంట్ కంట్రోలర్ స్వామి పాల్గొన్నారు.

## దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**వడమాలపేట,డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



దివ్యాంగ విద్యార్థులపై మరింత ప్రత్యేక శ్రద్ధ చూపాలని సమగ్ర శిక్ష, సహిత విద్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్.కల్పన కోరారు. శుక్రవారం వడమాలపేట మండలంలోని భవిత కేంద్రాలను తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కేంద్రాల పనితీరుపై సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించగా సంతృప్తిగా ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. మీ పిల్లలను క్రమం తప్పకుండా స్కూలుకు పంపడం వల్ల వారిలో మనోధైర్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, వడమాలపేట ఎంఈవోలు పద్మావతి, తులసిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటరు సవరణ అభ్యంతరాలపై తహాశీల్దారుకు ఫిర్యాదు

**విజయపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



ఓటరు సవరణ, అభ్యంతరాలపై అఖిలపక్షం నాయకులు శుక్రవారం తహాశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందించారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు స్థిర నివాసం ఉన్నవారి ఓట్లను తీసి వేశాయలని ఆన్‌లైన్‌లో అభ్యంతరం తెలిపారని, గ్రామాల్లో బిఎల్ఓలు విచారణ సమయంలో ఫిర్యాదు చేసిన వ్యక్తులు కనిపించడం లేదని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీలకు అతీతంగా నమోదు చేయాలని, తేడా వస్తే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గం

**రేణిగుంట, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



ఎయిడ్స్‌కు ముందు లేదని నివారణ అక్కడే మార్గమని కళాశాల డైరెక్టర్ డా.సి.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా తిరుపతికి చెందిన జఫన్యా కాలేజీ ఆఫ్ నర్సింగ్ ఓవీఆర్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కలసి సంయుక్తంగా ప్రజల్లో ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం కొరకు బీఎస్సీ నర్సింగ్ జనరల్ నర్సింగ్ విద్యార్థుల చేత రేణిగుంటలో ర్యాలీ నిర్వహించారు. కళాశాలల కరస్పాండెంట్స్ డా. వి.విజయభాస్కర్ యాదవ్, త్రిపురాదేవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు సాగింది. సదస్సులో నర్సింగ్ ప్రిన్సిపల్ శ్రీజ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎయిడ్స్ రోగుల పట్ల సానుభూతి ఉండాలని, అంటరాని వారిగా వారిని చూడరాదని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డా. సి.రమేష్‌కుమార్‌రెడ్డి,కళాశాల ఏవో డా. ఎం.తంగరాజన్‌లు మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కళాశాల కరస్పాండెంట్ వి.విజయభాస్కర్‌యాదవ్, త్రిపురాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

## స్వర్ణమ్మ హారతి ఉత్సవాల పనుల పరిశీలన

**-డిసెంబర్ 12 అంగరంగవైభవంగా స్వర్ణమ్మకు హరతులు**

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



కార్తీకమాసం పవిత్రమైంది. శివకేశవులకు ప్రీతిపాత్రం. ఈనేపథ్యంలో ప్రతి ఏడాది దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంకు ఆనుకుని ఉన్న పవిత్ర స్వర్ణముఖినదికి కార్తీకమాసంలో ప్రతి ఏడాది హరతులివ్వడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఈఏడాది కూడా స్వర్ణమ్మహారతులకు ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పనులను పరిశీలించి పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ఈఈ నూతకరత్నంతో కలసి పనులను పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత వైభవంగా 40 నుంచి 50 అండుగులతో ఐదు సార్లు నదీహారతులు ఇచ్చేందుకు అనుగుణంగా శాశ్వతవేదిక ఏర్పాటు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈవేదిక ద్వారా స్వర్ణమ్మ మహాహారతిని సామాన్యభక్తులు వీక్షించే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ అధికారులను కోరారు. నేటి నుంచి జెసిబి సాయంలో ప్రాంగణం మొత్తం పరిశుభ్రం చేసి పనులను ప్రారంభిస్తున్నామని గతంలో ఎన్నడూ లేని విధంగా లైటింగ్ డెకరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**సంప్రదాయాలకు పెద్దపీట:**

పుణ్యక్షేత్రం దక్షిణ కైలాసంలో వెలసిన భోళాశంకరుని సన్నిధిలో ఎన్నో పురాతన సంప్రదాయాలకు స్వస్తి చెప్పారని అందులో పూర్వ విజయయాత్రంలో భాగంగా రాయలసీమను రతనాల సీమగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయలు విచ్చేసినపుడు ఇక్కడి స్వర్ణముఖి నదిలో 'కార్తీక మాసంలో గంగమ్మ తల్లికి హారతులిచ్చారని' ప్రస్తుతం ఆ మహోన్నత కార్యక్రమాల్ని చేపట్టారు. ఇదో మహా ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది స్వర్ణముఖి నదికి నీళ్ళు కూడా వచ్చాయి. అంతేకాక రెండేళ్ళ క్రితం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రకటించిన మేరకు స్వర్ణముఖి ఆధునీకరణ పనులు చక చకా సాగుతున్నాయి.

**భక్తులు విశేష సంఖ్యలో కదలిరండి:**

శ్రీకాళహస్తి ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో శాసనసభ్యుడు ధర్మకర్తల మండలి పదవిని అప్పగించారని ఆయన మనోభావాలు ప్రణాళికలకు అనుగుణంగా పరిపాలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు.పట్టణంలోనూ ఆలయానికి వచ్చిన భక్తులు, విఐపిలు మొందట చూసేది స్వర్ణముఖి నదిని అని అయితే ఈ నదిని ఊర్లోని మురికి నీటితో మురికి ముఖి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.150కోట్లతో ప్రాజెక్టు వద్ద ఆనకట్ట నదిలో చెక్‌డ్యాంలతో నదికి పూర్వ వైభవం కల్పించటమే కాకుండా హైదరాబాదును మరిపించే విధంగా తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నారమన్నారు. శతాబ్దాల తరువాత 'స్వర్ణమ్మ హారతులు' నిర్వహిస్తున్నాము కాబట్టి చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు ప్రజలు కదలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అలాగే భక్తులు కూడా నేతి దీపాలు తెచ్చుకొని గంగమ్మకు సమర్పించవచ్చన్నారు. ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఇంజనీరింగ్ ఎఈఈ కిషోర్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ మరియు దేవస్థానం సిబ్బంది ఛైర్మన్ సిసి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శివలింగార్చన

**-రథం ఆకృతి పుష్పాలతో అలంకరణ**

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్ర కార్తీకమాసంలో శివలింగార్చన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గురుదక్షిణామూర్తి వద్ద కార్తీకమాసంలో శుక్రవారం శివలింగాన్ని పురస్కరించుకుని దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు ఆధ్వర్యంలో దీపాలను వేదమంత్రోచ్చారణల నడుమ వెలిగించారు. భక్తులు శివనామర్మరణ చేస్తూ కార్తీకదీపం వెలిగించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపుమధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపుశ్రీవాణి మొదటి దీపాన్ని వెలిగించారు. శివలింగారర్చన దీపోత్సవాన్ని విశ్రాంత ఉపాధ్యాయుడు పోలస్వామి స్వర్ణమూర్తి దీపోత్సవాన్ని అలంకరించి తీర్చదిద్దారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలోని శివలింగాకృతి పుష్పాలశోభితంతో ఏర్పాటు చేశారు. శివలింగం ఆకృతి చుట్టూ కార్తీకదీపాలను వెలిగించారు. భక్తులు శివమనాస్మరణ చేస్తూ హరహర మహదేవ శంభోశంకర అంటూ శివనాస్మమరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీదేవి, దేవస్థానం అధికారులు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, స్థానికులు దాము, సిసి సుదర్శన్‌రెడ్డి, పసులేటి కామేశ్వరరావు, మరియు స్వర్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పట్టు పరిశ్రమలో ఆధునిక శిక్షణ

**రేణిగుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త:**




రేణిగుంట మండలం చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో గ్రామీణ యువతకు పట్టు పరిశ్రమలో వారంరోజులు జరిగే సాకేంతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక శిక్షణ కార్యక్రమానికి ప్రారంభోత్సవంజరిగింది. ఆత్మ చిత్తూరు మేనేజ్ హైదరాబాద్ సహకారంతో రాస్ కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అ2ధిక పట్టు గూళ్ళ దిగుబడికి గ్రామీణ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా. శ్రీనివాసులు మాట్లాడుతూ వృత్తి శిక్షణ ద్వారా వారంరోజుల పాటు యువకులకు అనేక సాంకేతిక అంశాలను తెలియజేసి వారికి తర్ఫీదును ఇస్తామన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన నిండ్ర, కేవీబీ పురం, పిచ్చాటూరు, రేణిగుంట, నారాయణవనం మండలాల నుంచి కొత్తగా పట్టు పరిశ్రమ చేపడుతున్న యువతకు ఆధునిక పద్దుతులతో పాటు ప్రయోగాత్మకంగా పట్టుపరిశ్రమ గురించి నేర్పిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జి.రత్నప్రసాద్, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్, యువత ఈ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకుని యువత ఉద్యోగాల కొరకు ఎదురు చూడకుండా, వృత్తి శిక్షణ కార్యక్రమం ద్వారా నైపుణ్యతలు అలవరచుకుని పట్టు పరిశ్రమ వంటి వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎంచుకున్నట్లయితే ఉద్యోగి మాదిరి ప్రతి నెల ఆదాయం పొందవచ్చని తెలిపారు. పట్టు పరిశ్రమ జిల్లా అధికారి గీతారాణి మాట్లాడుతూ పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు ప్రభుత్వ అందజేయనున్న పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త హెడ్. డా. ఎస్.శ్రీనివాసులు, ఏ.పద్మజ, పట్టు విభాగ శాస్త్రవేత్త జి.రత్నప్రసాద్, డీపీడీ ఆత్మ గీతారాణి పట్టు పరిశ్రమ జిల్లా అధికారి, పట్టుపరిశ్రమ అధికారులు కల్యాణి, భారతి, రమేష్‌రెడ్డి, గ్రామీణ కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## కార్తీకమాసంలో ఆకాశదీపం..అందరికీ శుభప్రదం

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



కార్తీమాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం ఎదురుగా ఆకాశదీపాన్ని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి విచ్చేసి ఆకాశదీపాన్ని వెలిగించారు.ఈ సందర్భంగా బియ్యపుశ్రీవాణి మాట్లాడుతూ కార్తీకమాసం శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయన ఎసి మల్లికార్జున ప్రసాద్, దేవస్థాన పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, రమాప్రభ, ప్రత్యేక ఆహ్వానసభ్యులు శ్రీదేవి, ఆలయ అధికారులు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు మరియు అర్చకులు మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## తొట్టంబేడులో హెచ్‌ఐవిపై అవగాహనపై ర్యాలీ

**తొట్టంబేడు, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



అవగాహనతోనే హెచ్ఐవి నిర్మూలించవచ్చని స్టెప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు తొట్టంబేడు వైద్యాదికారి డాక్టర్ లహరి అన్నారు. డిడిఓ డాక్టర్ తేజేశ్వరి ఆదేశాల మేరకు శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్టెప్స్ స్వచ్ఛందసేవాసంస్థ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో హెచ్‌ఐవిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ లహరి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిని అరికట్టడానికి అవగాహనతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాదికారిణితో పాటు స్టాఫ్‌నర్సు రేఖ, ల్యాబ్‌టెక్నీషియన్‌భాను,పిహెచ్ఓ రత్నాకర్, ఎల్ఎంహెచ్‌పి లిఖిత్‌కుమార్, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## 'ఆడుదాం - ఆంధ్రా'కు క్రీడా సామాగ్రి సిద్ధం

**- తిరుపతిరూరల్లో 37 సచివాలయాలకు క్రీడా సామాగ్రి పంపిణీ**

**- క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలి: ఎంపిడిఓ రమేష్‌బాబు**

**తిరుపతిరూరల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**



యువతను క్రీడలు వైపు మళ్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకోస్తుందని, అందులో భాగంగానే 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తిరుపతిరూరల్ ఎంపిడిఓ కనపర్తి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ తిరుపతిరూరల్లో ఉన్న 37 గ్రామ సచివాలయాలకు క్రీడా సామాగ్రిని పంఫిణి చేసారు. ఒక్కో సచివాలయానికి 3-క్రికెట్ కిట్స్, 1-బ్యాట్‌మెంటన్ నెట్, 6-బ్యాడ్మెంటెన్ రాకేట్స్, 3- బ్యాడ్మెంటెన్ నైలాన్ కాక్స్ బాక్స్‌లు, 3-వాలీబాట్స్, 1-వాలీబాల్ నెట్, 2-టెన్నిస్ కిట్‌లను అందజేసారు. అనంతరం ఎంపిడిఓ కనపర్తి రమేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొట్టమెదటిసారిగా రాష్ట్రస్థాయి క్రీడా సంబరాన్ని చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తుందని, ఔత్సాహికులైన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడలు జరగనున్నాయని, క్రికెట్, బాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ ఆటల ద్వారా యువత ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మనవాళ్ళు పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమ నిర్వాహణ ఉంటుందని తెలిపారు. ఈనెల 15న ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం ప్రారంభమై 50రోజుల పాటు క్రీడలు జరగనున్నాయని తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు క్రీడా సంబరాలకు అర్హులని తెలిపారు. గ్రామీణ యువతలో దాగియున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయుటకు ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పిచ్చిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కొండూరు వాసుదేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం లాంటింది

**-ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి**

**పుత్తూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :**

ప్రజాస్వామ్య దేశాల మనుగడకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్



డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఓటు హక్కుపై శుక్రవారం కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పాలకులను ఎంపిక చేసుకునే హక్కు ప్రజలకు ఓటు హక్కు ద్వారా లభించిందని తెలిపారు. ముఖ్య అతిథి నగరి ఆర్‌డిఓ సుజన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు నిండిన విద్యార్థినీ, విద్యార్థులంతా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు పదో తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తీసుకుని వస్తే సోమవారం డిగ్రీ కాలేజీలో ఓటరు నమోదు ప్రక్రియలో నమోదు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు ఎ.నాగేశ్వరరావు, డాక్టర్ కోటేశ్వరయ్య, టి.నరసింహులు, డాక్టర్ ఆర్.బి.వాణిశ్రీ, డాక్టర్ పి.హరిబాబు, డాక్టర్ పి.సుజన, డాక్టర్ కోటేశ్వరరావు, సావిత్రి తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌ను గుర్తిస్తే నియంత్రించవచ్చు..!

**ఎయిడ్స్ డే అవగాహనా ర్యాలీ- హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ**

**చంద్రగిరి, డిశంబర్ 1 ప్రభాతవార్త:**



ఎయిడ్స్ మహమ్మారిని సకాలంలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయలేకపోయినప్పటికీ నియంత్రించవచ్చని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని శుక్రవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధన విభాగం, గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్ర ం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించి, టవర్ క్లాక్ వద్ద మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి వైరస్ సంక్రమించినప్పటికీ తెలియకపోవచ్చున్నారు. ఆహారం, నీరు పంచు కోవడం, కరచాలనం, ముద్దు పెట్టుకోవడం వలన వైరస్ వ్యాపించదన్నారు. అయితే హెచ్ఐవి సోకిన వ్యక్తి రక్తం, వీర్యం, యోనిస్రావాలు, తల్లి పాలు ద్వారా ఇది వ్యాపించగలదన్నారు. వైరస్ సోకకుండా ఉండడానికి నైతిక విలువలతో కూడిన జీవితాన్ని గడపడం, అరక్షిత శృంగారాన్ని నివారించడం, కండోమ్స్ వాడుట, కలుషిత సూదులను వాడకపోవడం, తల్లి నుండి బిడ్డకు సోకనీయకుండా వైద్యుల చికిత్స మేరకు మందులను వినియోగించడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ యు.వి.ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ రెడ్డి, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రేవతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట హరిప్రసాద్, వైద్య సిబ్బంది తేజశ్వని, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకురాలు వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గాకొటాల





**-వైస్ చైర్మన్‌గా చేగు గోవర్ధన్ గుప్తా**

**చంద్రగిరి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:**

చంద్రగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డిని, వైస్ చైర్మన్‌గా చేగు గ్రూపు సంస్థల అధినేత చేగు గోవర్ధన్ గుప్తాను నియమిస్తూ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారిక ఉత్తర్వులిప్పించాలని కోరుత ముఖ్యమంత్రికి ప్రతిపాధనలు పంపారు. నియోజకవర్గ కేంద్రంగా వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయించిన ఘనత చెవిరెడ్డికే దక్కుతుందని అధ్యక్ష, ఉపాధ్యక్షులు కొనియాడారు. తమ నాయకుడు పార్టీలో పనిచేసే వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ పట్ల ఎంఎల్ఏ పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని అన్నారు. సిఎంకు, ఎంఎల్ఏకి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎయిడ్స్ వ్యాధి అనేది..అంటువ్యాధి కాదు

**-ఎయిడ్స్ రోగుల పట్ల సానుభూతి ఉండాలి**

**-ప్రజలకు ఓవిఆర్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీజ సూచన**



**తిరుపతిటౌన్,డిసెంబర్ 1 ప్రభాతవార్త:**

ఎయిడ్స్ వ్యాధి అనేది అంటువ్యాధి కాదని,ఎయిడ్స్ రోగుల పట్ల ప్రజలు సానుభూతి కలిగి ఉండాలని జఫన్యా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు ఓవిఆర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీజ అన్నారు.శుక్రవారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం కోసం బిఎస్సీ నర్సింగ్ మరియు జనరల్ నర్సింగ్ విద్యార్థుల చేత రేణిగుంటలో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని కళాశాలల కరస్పాండెంట్లు డా॥వి.విజయభాస్కర్ యాదవ్,త్రిపురాదేవిలు జెండా ఊపి ప్రారంభించారు.ఈ ర్యాలీ రేణిగుంట రైల్వేస్టేషన్ నుండి పంచాయితీ కార్యాలయం వరకు సాగింది.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి,ప్రజలకు అవగాహన కల్పించే విధంగా బ్యానర్లు,ప్లకార్డులు పట్టుకుని స్లోగన్స్‌తో విద్యార్థులు,అధ్యాపకులు ఈ కార్యక్రంలో పాల్గొన్నారు.అనంతరం పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో కళాశాల డైరెక్టర్ డా॥పి.రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణకు మందు లేదని,నివారణ ఒక్కటే మార్గమన్నారు.కావున ప్రతి ఒక్కరు ఎయిడ్స్ పట్ల పూర్తి అవగాహనను కలిగి ఉండాలని సూచించారు.సర్పంచ్ నగేష్ మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారిని తరిమి కొట్టేందుకు మనమందరం చేతులు కలుపుదామని,అందరిలోను అవగాహన పెంచుదామని,తద్వారా ఎయిడ్స్ లేని సమాజాన్ని చూడాలని పిలుపునిచ్చారు.

## ఎయిడ్స్ భూతం..అవగాహనతోనే అంతం

**- ఎన్‌బికెఆర్ విద్యార్థుల ర్యాలీ**

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త**




ఎయిడ్స్ భూతాన్ని అవగాహనతోనే నివారించవచ్చని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ఎన్‌సిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత హెచ్ఐవి పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఎటువంటి దురలవాట్లు లేకుండా మంచి ప్రవర్తన కలిగి ఉండి వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. క్షణికావేశంలో కుటుంబాలను నాశనం చేసుకోవద్దని కోరారు. హెచ్ఐవికి మందులేదని, నివారణ ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అండ్ హుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ చింతా రవీంద్రారెడ్డి, ఎన్‌సిసి ఆఫీసర్లు మాధవయ్య, మల్లికార్జునరెడ్డి, శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఉదయ్‌కుమార్‌రాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో విద్యార్థుల ర్యాలీ

**కోట, డిసెంబర్ 1 ప్రభాతవార్త**

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు ప్రపంచాన్ని గడగడలాడించిన ఎయిడ్స్ మహమ్మారి మళ్లీ చాపకింద నీరులా విస్తరిస్తోందన్నారు. అప్రమత్తతతోనే మహమ్మారిని నివారించగలమన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజేష్, ఎన్‌సిసి ఆఫీసర్ గాది శ్రీనివాసులు, ప్రతాప్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మిగులుభూములు ప్రజాప్రయోజనాలకు ఉపయోగించాలి

**శాంతిపురం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**



మండలంలోని సాతు రెవెన్యూ పరిధిలో ఎపిఐఐసికి కేటాయించిన భూముల్లో పది ఎకరాలు పోగా మిగతా భూమిని ప్రజాప్రయోజనాలకోసం వినియోగిం చాలని గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం ఎపిఐఐసికి భూముల కేటాయింపుకై గ్రామసభను రాళ్లబూదుగూరు సచివాలయంలో ఏర్పాటుచేశారు. కాగా పరిశ్రమల ఏర్పాటుకు గాను గతంలోనే ఎపిఐఐసికి 19 ఎకరాలు 2016లోనే కేటాయించారన్నారు. ఇప్పుడు పది ఎకరాలు మాత్ర ం కేటాయిస్తుండడంతో మిగులు భూములపై అధికారులను ప్రజలు ప్రశ్నించారు. మిగులు భూముల్లో అన్యులకు పట్టాలు ఇవ్వరాదని మైనార్టీల కోసం కమ్యూనిటీ హాలు అలాగే అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డీ ఈశ్వర్, సర్పంచ్ లక్ష్మి, కో ఆప్షన్ నిసార్, వార్డు సభ్యులు వాజిద్, ఫారూఖ్, రంగనాథరెడ్డి, కార్యదర్శి వనిత, విఆర్వో రామిరెడ్డి, సర్వేయర్ గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తీరాలంటే అణగారిన వర్గాల ప్రభుత్వం రావాలి

**- బాస్ వ్యవస్థాపకుడు శివప్రసాద్**

**కుప్పం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**




ప్రజల కష్టాలు తీరాలంటే అణగారిన వర్గా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సుజ్ఞానంద మండపంలో జరిగిన రూల్ ఆంధ్రా సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, నిరుద్యోగం, రైతుల ఆత్మమత్యలు, మహిళల అఘాయిత్యాలు, కులమత వివక్షలు తొలగాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర రాజకీయం డెబ్బై ఏళ్లుగా ఆధిపత్య కులాల చేతుల్లోనే ఉంటోందన్నారు. రెండు కుటుంబాలు, రెండు కులాలు, రెండు పార్టీలు వారసత్వ ఆస్తిగా అధికార ం చెలాయిస్తున్నారని ఆరోపించారు. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు ఎన్నికల్లో పోటీ చేసేలా విసికె పార్టీ కొత్త విధానంలో వస్తుందని అందుకే రూల్ ఆంధ్రా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నేతలు గణపతి, మురుగేషన్, ముత్యాల మోహన్, బాలకృష్ణ, గోవిందప్ప, తాతయ్య, వేలు, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో అంబేద్కర్ విగ్రహంకు నివాళులు అర్పి ంచి ర్యాలీ నిర్వహించారు.



## కన్నీటి పర్వం నడుమ సుదర్శన్‌రెడ్డి అంత్యక్రియలు

**-వైకాపా, టిడిపి ప్రముఖుల నివాళి**

**నారాయణవనం, డిసెంబర్ 1 ప్రభాతవార్త :**

నారాయణవనం మండల వైకాపా సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి, మాజీ డిసిసిబి డైరెక్టర్, ప్రస్తుత నారాయణవనం ఎంపిపి పి.దివాకరరెడ్డి తండ్రి పెల్లేటి సుదర్శన్‌రెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు ఆయన అంత్యక్రియలు ప్రజల కన్నీటి పర్వం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి దాహన సంస్కారాలు నిర్వహించారు. ఉదయం డిప్యూటీ సిఎం కె నారాయణస్వామి, తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, తాడిపత్రి వైకాపా పరిశీలికులు బీరేంద్రవర్మ, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత, సత్యవేడు టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ హెచ్ హెలెన్ తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. సుదర్శన్‌రెడ్డి ఏ పార్టీలో వుంటే ఆ పార్టీకి అంకిత భావంతో పని చేసేవారని కొనియాడారు. ఆయన నుంచి ఎంతో మంది రాజకీయం నేర్చుకొని ఉన్నత స్థితిలో వున్నారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. అయితే సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆది మూలం, అతని తనయుడు కోనేటి సుమన్ కుమార్‌లు దగ్గరుండి అంత్యక్రియలను పూర్తి చేశారు. నియోజక వర్గంలోని ఏడు మండలాలకు చెందిన వైకాపా నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. అలాగే మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకా యులు, టిడిపి మం డల క్లస్టర్ కన్వీనర్ పి గిరి బాబు పాల్గొన్నారు.

వార్త
ప్రభాతవార్తకు
విలేకరులు కావలెను
తెలుగు దిన పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
తిరుపతి ప్రెస్‌క్లబ్, తిరుపతి ఎడ్యుకేషన్, తిరుపతి జిల్లా కలెక్టరేట్, తిరుచానూరు, చిత్తూరు టౌన్, చిత్తూరు జిల్లా కలెక్టరేట్, పలమనేరు, పుంగనూరు, పాలసముద్రం, నాయుడుపేట, ఓజిలి కేంద్రాల్లో పనిచేయుటకు.
మీ పూర్తి బయోడేటాతో...
వారం రోజుల లోపు ఈ క్రింది అడ్రస్సును సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, మూడవ మైలురాయి, రేణిగుంటరోడ్డు, తిరుపతి. సెల్: 9848131880